క్లుప్తంగా

కలియుగ వెంకన్నకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

కంచరపాలెం: తిక్క వానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భాద్రపద మాస శుద్ధ అష్టమి సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగన్నాథశర్మ ఆధ్వర్యంలో వెంకన్నకు ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు కల్పించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

'గ్రీవెన్స్'కు వినతులు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు స్వీకరించి కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు


వాటర్ ప్యూరిఫైయర్‌ను ప్రారంభిస్తున్న దాత వెంకటరత్నం

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో వాకర్స్ కోసం ప్రత్యేకంగా వాటర్ ప్యూరిఫైయర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అవసరమైన రూ.25,000 నగదును పూసర్ల వెంకటరత్నం అందించారు. ఈ వాటర్ ప్యూరిఫైయర్‌ను శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించి వాకర్స్‌కు తాగునీరు అందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్‌వీ సుధాకర్, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, కేజీ కృష్ణారావు, సత్తి సునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, ఆర్.వెంకటరమణ, ఆర్.నాగేశ్వరరావు, బి.సూర్యనారాయణ, వాకర్స్ క్లబ్ సభ్యులు, పూర్వ కార్యవర్గ సభ్యులు, పార్కు సందర్శకులు విరాళ దాత వెంకటరత్నంను అభినందించారు.

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు స్వామికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వాడవాడలా అన్నసమారాధనలు


సీతంపేటలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ సారిపల్లి గోవింద్


నందగిరినగర్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ


51వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ


కస్తూరినగర్‌లో అన్నదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


గణేష్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. 25వ వార్డు సీతంపేటలోని సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా ఉన్న రోడ్డులో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఒమ్మి ఆనంద్, వానపల్లి లక్ష్మణకుమార్, కిషోర్, తాతారావు, సూరిబాబు, గురువులు, ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్‌లో నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

● 25వ వార్డు గణేష్‌నగర్‌లో ఆనంద గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవాలకు అన్ని విధాల సహకరించిన సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బాబీ, ప్రసాద్, శ్రీనివాస్, హరికృష్ణ పాల్గొన్నారు.

43, 44, 25 వార్డుల్లో..

జీవీఎంసీ 43, 44, 25 వార్డుల్లో పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. నందగిరినగర్‌లో లవ్లీ బాయ్స్, నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బానాల తరుణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వెంకటరావు, గోపి, సంతోష్, కొండ, రాజు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

● 25వ వార్డు శాంతిపురంలో శాంతి యంగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

46వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కస్తూరినగర్‌లో సిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం గణపతి నిమజ్జనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

వినాయక మండపాల సందర్శన

మద్దిపాలెం: జీవీఎంసీ 55, 51 వార్డుల్లోని పలు వినాయక మండపాలను శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సందర్శించి పూజలు చేశారు. 55వ వార్డు తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్‌లో వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు.

● 51వ వార్డు వుడా కాలనీలో లవ్లీ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి దర్శించుకున్నారు. మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


జీవీఎంసీ అధికారులతో సమీక్షిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: నియోజకవర్గ అభివృద్ధి పనులపై శనివారం బాలయ్యశాస్త్రి లేవుట్‌లోని పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ జోన్–3, 5ల ఇంజినీరింగ్ అధికారులతో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. రహదారి విస్తరణ పనులు, కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, మెట్లు, డ్రెయిన్లు, యూజీడీ, వాటర్ వర్క్స్‌తోపాటు ఇతర అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధి పనులతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. అక్టోబర్‌లో విశాఖ నుంచి పరిపాలన సాగించనున్న నేపథ్యంలో ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, విజయలక్ష్మి, ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ, శ్రీనివాస్, డీఈ భరణి, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయం ప్రసాదించే వినాయకుడు



ప్రవచిస్తున్న సందీప్‌శర్మ

సీతంపేట: విజయం ప్రసాదించేవాడు వినాయకుడని శతావధాని తాతా సందీప్ శర్మ అన్నారు. శంకరమఠంలో గణేశ పురాణంపై జరుగుతున్న ప్రవచనాల్లో భాగంగా శనివారం పలు ఆసక్తికర విషయాలను ప్రవచించారు. విశేషమైన మార్గంలో నడిపేవాడు వినాయకుడని, గణేశ పురాణ ఉపాసనా ఖండం స్పష్టం చేస్తోందన్నారు. తారకాసుర సంహార సమయంలో కుమారస్వామిని కూడా గణపతి ఆరాధించి వరద గణేశ వ్రతాన్ని ఆచరించాడని తెలిపారు. కుమారస్వామి లక్ష్య గణపతిని, మన్మథుడు మహోత్కట గణపతిని ప్రతిష్ఠించి శుభాన్ని పొందారన్నారు. ఏకాక్షర, షడక్షర మంత్ర రూపాల్లో గణపతి ఆరాధింపబడుతున్నాడని వివరించారు.

విద్యుత్ సర్వీస్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం

తాటిచెట్లపాలెం: విద్యుత్ వినియోగదారులంతా తమ సర్వీస్ నంబర్లకు ఆధార్ నంబర్‌ను అనుసంధానించాలని ఏపీఈపీడీసీఎల్ జోన్–1 డివిజన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియను తమ మొబైల్ ఫోన్‌లోనే వినియోగదారులు చేసుకోవచ్చని తెలిపారు. మొబైల్‌లో ఏపీఈపీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, 16 అంకెల సర్వీస్ నంబర్‌ను ఎంటర్ చేసిన తరువాత 12 అంకెల ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవచ్చని చెప్పారు. లేదా లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్, మీటర్ రీడర్(బిల్ రీడర్లు) వినియోగదారుల వద్దకు వచ్చినపుడు ఆధార్ జెరాక్స్ కాపీని ఇచ్చి అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బిల్లు కౌంటర్లు, ఈఆర్‌వోల్లో, ఏఈ ఆఫీస్‌ల వద్ద, సమీప సబ్ స్టేషన్‌ల వద్ద కూడా ఆధార్ అనుసంధానం చేసుకోవచ్చని తెలిపారు. అక్కయ్యపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు ఈ విషయంలో ఏమైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే 94404 12792 /94408 12524 నంబర్లలో సంప్రదించాలని ఈఈ కోరారు.

గ్రంథాలయం ఒక దేవాలయం


పౌర గ్రంథాలయంలో ప్రసంగిస్తున్న రీజనల్ పీఎఫ్ కమిషనర్-2 వీర మణికాంత్

సీతంపేట: గ్రంథాలయం ఒక దేవాలయమని రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్–2 కె.వీర మణికాంత్ అన్నారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. లైబ్రరీ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ, ఉపాధ్యక్షుడు టి.ఎస్.ఆర్.ప్రసాద్ గ్రంథాలయంలోని అన్ని విభాగాలను ఆయనకు చూపించి, విద్యార్థులకు, పాఠకులకు కల్పించిన సదుపాయాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మణికాంత్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజానికి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతీ యువకులకు గ్రంథాలయం అద్భుతమైన బహుమతిగా పేర్కొన్నారు. పౌర గ్రంథాలయంలో ఆధునిక సదుపాయాలు కల్పించారని, చాలా అద్భుతంగా, ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. తన ఉద్యోగ ప్రయత్నాలు, ప్రిపరేషన్, పరీక్షలకు సంబంధించిన విషయాలను వివరించారు. ఒక పరీక్ష తప్పినంత మాత్రాన నిరాశ చెందకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించి విజయం సాధించాలన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ జోసెఫ్ కళాశాల స్నాతకోత్సవం


ఏయూ వీసీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న విద్యార్థిని

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆధ్వర్యంలో శనివారం కళాశాల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన దాదాపు 300 మంది విద్యార్థినులు ఉపకులపతి చేతుల మీదుగా పట్టాలు, పతాకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ కాన్వకేషన్ నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉత్తమ విద్యతో పాటు విద్యార్థినుల సంరక్షణ బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని కొనియాడారు. విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తున్న కళాశాల అధ్యాపకులను అభినందించారు. హిందీ విభాగాధిపతి, ప్రెస్ ఇన్‌చార్జి పి.కె. జయలక్ష్మి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి పురిపండా ఎనలేని సేవలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య చలం,భరణికాన రామారావు తదితరులు

సీతంపేట: సనాతన భావజాలాన్ని దశాబ్దం కిందటే పురిపండా అప్పలస్వామి వ్యతిరేకించారని, తన సాహిత్యం ద్వారా నిరసించారని అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సాయంత్రం అరసం విశాఖ జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని ఇతర ప్రాంతాలకు పరిచయం చేసింది పురిపండా అప్పలస్వామేనన్నారు. వాడుక భాష ప్రాచుర్యం పొందడానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆచార్య కె.ఎస్. చలం మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి పురిపండా ఎనలేని సేవలందించారన్నారు. ఆయన సాహిత్యం శ్రీశ్రీకి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు కార్యదర్శి నివేదిక అందజేశారు. అనంతరం శ్రీశ్రీ కవితలను భరణికాన రామారావు, పురిపండా కవితా సంకలనాన్ని ఆచార్య కె.ఎస్.చలం ఆవిష్కరించారు. కార్యదర్శి పి.శరచ్చంద్రజ్యోతి శ్రీ మాట్లాడుతూ అరసం రచయితలను ఉద్యమకారులుగా తయారుచేసిందన్నారు. ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ పురిపండా సాహిత్యాన్ని నూతన రచనల వైపు సాగే ప్రయత్నం చేశారని, వాడుక భాషను పాఠ్య పుస్తకాల్లో కూడా ప్రవేశపెట్టి ప్రోత్సహించారని తెలిపారు. కార్యక్రమంలో అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, డాక్టర్ క్షేత్రపాల్‌రెడ్డి, అడపా రామకృష్ణ, మస్తాన్‌రెడ్డి, కె.వి.ఎస్.మూర్తి, శ్యాంసుందర్, పి.ఎ.రాజు, ఎస్.హనుమంతుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం 6–7లలో ఈ నెల 17న అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది కలిసి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మరణించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. ఇతడి వయసు సుమారు 25 ఏళ్లు ఉండొచ్చని, ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని చెప్పారు. జీఆర్పీ ఎస్ఐ టి.కామేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులను స్వయంగా గానీ లేదా 94934 24987 నంబర్‌లో తెలియజేయాలని కామేశ్ కోరారు.

వెలమల సంక్షేమానికి సహకారం


వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వెలమ సంఘం నాయకులు, రొంగలి జగన్నాథం, ఎమ్మెల్యే అదీప్‌రాజ్


మురళీనగర్: వెలమల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, వెలమ సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు రొంగలి జగన్నాథం, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో మురళీనగర్–మాధవధార వెలమ సంక్షేమ సంఘం నాయకులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సంఘం అభివృద్ధికి కార్యాలయ భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సంఘ ప్రతినిధులు చెప్పారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ, సలహాదారు డాక్టర్ బోకం దేముడు, కోశాధికారి పాలుపురెడ్డి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు లాలం జానకీరామ్, దరిమిరెడ్డి దేముడు, సభ్యులు సిహెచ్.గోవింద, ఎన్.దేముడు, వై.దేముడు, పి.దేముడు, ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

శోభాయమానం.. శంకు చక్ర దీపోత్సవం


వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో విజయ గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో శనివారం ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని స్మరించుకుంటూ మహిళలు 1,008 దీపాలతో శంకునామ చక్ర దీపార్చన నిర్వహించారు. నియోజకవర్గంలోని భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. దీంతో ఆ ప్రాంతమంతా శోభాయమానంగా వెలుగొందింది. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ విజయ గణపతికి పూజలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, కార్పొరేటర్లు, యువజన విభాగం అధ్యక్షుడు శివగణేష్, కిరణ్ రాజు, నీలి రవి, రాజాం రాజు, అంబటి శైలేష్, అమర్‌నాథ్ రెడ్డి, మహేష్, గాలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణు గణపతి అలంకారంలో దుర్గాగణపతి


సీతంపేటలో పూజలందుకున్న విష్ణు గణపతి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి విశేష గణపతి హోమం, మహా అభిషేకం, సహస్రనామార్చన జరిపిస్తున్నారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం విష్ణు గణపతి అలంకారంలో దుర్గాగణపతి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. ఆదివారం వీర గణపతి అలంకారంలో స్వామి దర్శనమిస్తారని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఈవో రమాభాయి తెలిపారు.


నరసింహనగర్ రైతుబజార్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

నరసింహనగర్ రైతుబజార్‌లో మహా అన్నదానం

నరసింహనగర్ రైతుబజార్‌లో రైతులు, వ్యాపారులు నిర్వహిస్తున్న వినాయక పంచరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం మహా అన్నదానం చేశారు. ఈవో పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. ముందుగా వినాయకుడికి విశేష పూజలు చేశారు. సాయంత్రం మేళతాళాలతో అనుపు ఊరేగింపు నిర్వహించారు.

విఘ్నేశ్వరుడికి సహస్రనామార్చన


సహస్ర నామార్చన చేస్తున్న భక్తులు

మురళీనగర్: మురళీనగర్ ఓంశాంతి ఆశ్రమం రహదారిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ద్వారపూడి జగదీష్ శర్మ ఆధ్వర్యంలో సత్య రెసిడెన్సీ వాసులు గణపతికి తమలపాకులతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు, రమేష్‌ల సహకారంతో భక్తులకు అన్నప్రసాదం అందించారు.

ఈవీఎం గణేష్ కాన్సెప్ట్ సూపర్


ఈవీఎం గణపతి మండపంలో జియ్యాని శ్రీధర్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి లక్ష్మీనారాయణపురంలో ఏర్పాటు చేసిన ఈవీఎం గణపతి కాన్సెప్ట్ బాగుందని పలువురు నాయకులు కితాబిచ్చారు. శనివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఈవీఎం గణేష్‌ను దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎలక్షన్, పోలింగ్ బూత్, గుర్తింపు కార్డు, ఓటు హక్కు వినియోగంపై ప్రజలను చైతన్యపరిచేందుకు యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూషికాలతో ఏర్పాటుచేసిన ఈ మండపం బాగుందన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పీలా హరిప్రసాద్, సభ్యులను అభినందించారు. అనంతరం ఎకో వైజాగ్ బ్యాడ్జీలను జియ్యాని శ్రీధర్ అందజేశారు.

మానవ సేవే మాధవ సేవ నూతన కార్యవర్గం


మానవ సేవే మాధవ సేవ సంఘ కొత్త కార్యవర్గ సభ్యులు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ సంస్థ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం నిర్వహించారు. మురళీనగర్‌లో ఎన్నికల అధికారి డి.ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎస్.భానుప్రకాష్, ఉపాధ్యక్షులుగా కేఎస్‌వీఎస్ ప్రసాద్, ఎం.కోదండం, డి.వరప్రసాద్, కార్యదర్శిగా ఎస్.సీతారామకృష్ణ, సహాయ కార్యదర్శిగా పి.సంతోష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.వెంకటేశ్వరరావు, కె.భవానిశంకర్, కోశాధికారిగా కె.వి.వర్మ, ఉప కోశాధికారిగా పి.వెంకటరావు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.